సమస్యల వలయంలో ఇండోర్ స్టేడియం

• లైట్లు పనిచేయకపోవడంతో అంధకారంలో 'ఇండోర్' • వర్షం కురిసిన ప్రతిసారి స్టేడియంలోకి నీరు • ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు • నిర్వహణను గాలికొదిలేసిన జీహెచ్‌ఎంసీ

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని అడిక్‌మెట్ మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. వర్షపునీరు స్టేడియంలోకి రావడంతో క్రీడాకారులు జారి పడుతున్నారు. సుమారు 120 ట్యూబ్ లైట్లలో 30 లైట్లే పనిచేయడంతో స్టేడియంలో అంధకారం నెలకొంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు చేస్తే ఆయన జోనల్ కమిషనర్‌కు లేఖ రాశారు. అయినా ఇప్పటి వరకు స్పందించకపోవడం గమనార్హం. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి, ప్రజాప్రతినిధుల ఉదాసీన వైఖరికి సాక్షిభూతంగా నిలుస్తోంది.


షటిల్ కోర్టులో చేరిన వర్షపునీరు


అంధకారంలో అడిక్‌మెట్ మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

వినియోగంలో కేవలం నాలుగు కోర్టులే...

◆ ఇండోర్ స్టేడియంలో నాలుగు షెటిల్ కోర్టులు, యోగా, జిమ్, కరాటే, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడా కోర్టులను ఏర్పాటు చేశారు. అందులో కేవలం నాలుగు షెటిల్ కోర్టులు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగతా క్రీడా కోర్టులను గాలికి వదిలేశారు. ఈ ఇండోర్ స్టేడియంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సుమారు 120–150 మంది వరకు షటిల్ ఆడుతారు. సుమారు రూ.4కోట్లతో పదేళ్ల క్రితం ప్రనులు ప్రారంభించారు. నాలుగేళ్ల క్రితం నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ స్పోర్ట్స్ కంప్లెక్స్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

తలా ఇంత డబ్బులేసుకుని..

◆ షెటిల్ క్రీడాకారులు అసోసియేషన్‌గా ఏర్పడి స్టేడియానికి కావాల్సిన కనీస సౌకర్యాలను చూసుకుంటున్నారు. క్రీడాకారులు తలా ఇంత డబ్బులేసుకుని రూ.50వేలతో అధునాతన నెట్‌లు ఏర్పాటు చేసుకున్నారు. చివరకు ఫ్యాన్‌లు, బెంచీలు, కర్టెన్స్, డస్ట్ బిన్ డబ్బాల ఏర్పాటు సైతం సొంత డబ్బుతో చేసుకున్నారు. వాటికి బిల్లులు పెడితే డబ్బులు మంజూరు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు తిరిగి ఇవ్వకపోవడం గమనార్హం. క్రీడాకారులకు మంచినీటి వసతులు కూడా లేకపోవడంతో నాయిని ఫౌండేషన్ వారు ముందుకొచ్చి ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేసి సౌకర్యాలు కల్పించాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

లైటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నా..



ఇండోర్ స్టేడియంలో నెలకొన్న సమస్యలపై ఇటీవల క్రీడాకారులు నా దృష్టికి తీసుకొచ్చారు. అనేక సార్లు ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడాను. తాజాగా జోనల్ కమిషనర్‌కు లైటింగ్ ఏర్పాటు చేయాలని లేఖ కూడా రాశాను. మరోసారి జోనల్ కమిషనర్‌తో మాట్లాడి త్వరలో సమస్యకు పరిష్కారం లభించేలా కృషి చేస్తాను. – ఎమ్మెల్యే ముఠా గోపాల్

మరమ్మతులు చేపట్టండి



అడిక్‌మెట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ రాంనగర్, విద్యానగర్, అంబర్‌పేట్, ముషీరాబాద్, పద్మారావునగర్‌లతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి 150 మందికిపైగా క్రీడాకారులు ప్రతి రోజు వస్తుంటారు. కానీ వారికి కావాల్సిన కనీస సౌకర్యాలు జీహెచ్‌ఎంసీ కల్పించకపోవడం విచారకం. ప్రస్తుతం ఈ కోర్టులో లైటింగ్ పూర్తిగా పోవడంతో చీకటి అలుముకుంది. జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికి స్పందన కరువైంది. కాబట్టి జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ విభాగం అధికారులు వెంటనే ఈ లైటింగ్‌తో పాటు ఇతర క్రీడా కార్యక్రమాలను కూడా చేపట్టాలని కోరుతున్నాం. – ఎంఎస్ చారి, క్రీడాకారుడు

అవసరమైతే తప్ప బయటకు రావొద్దు

నల్లకుంట కార్పొరేటర్ అమృత



నల్లకుంట: రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల లోంచి బయటకు రావద్దని నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత సూచించారు. శనివారం నల్లకుంటలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో హుస్సేన్ సాగర్, మూసీ పరీవాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదల సమయంలో వీధుల్లోని మ్యాన్‌హోళ్ల మూతలను తెరవొద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే తనకు సమాచారం అందించాలని కోరారు.

అన్నదానం



చిక్కడపల్లి: ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మానవజన్మకు సార్థకత లభిస్తుందని ప్రముఖ సాహితీ వేత్త, ఆచార్య టి.గౌరీశంకర్ అన్నారు. శనివారం శ్రీకృష్ణ మందిరం స్వర్ణోత్సవాలు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా కృష్ణ భక్తురాలు స్వర్గీయ టి.అంజనీదేవి స్థాపించిన ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీఆర్‌వో లయన్‌డా. జీకే రమణ, రాధాకిషన్ పాల్గొన్నారు.

టీబీఎస్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ్‌కుమార్

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూపాలపల్లి జిల్లా నివాసి పామరాజు విజయ్‌కుమార్ నియమితులయ్యారు. శనివారం నల్లకుంటలో జరిగిన టీబీఎస్ఎస్ సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఆయనకు నియామక పత్రం అందజేసి మాట్లాడారు. టీబీఎస్ఎస్ గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ ఆదేశానుసారం ఈ నియామకం జరిగిందన్నారు. తమ సమితి బ్రాహ్మణ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, ఆర్కే దేశ్‌ముఖ్, కోశాధికారి మంత్రి సునిల్, సహాయ కార్యదర్శి అక్కిరాజు దుర్గా ప్రసాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు డా. విష్ణుదాస్ గోపాలరావు, రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



ఫ్రెషర్స్ డే మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య సూచించారు. బాగా చదువుకోని తల్లి దండ్రులు, గురువులకు మంచి పేరును తీసుకు రావాలన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో న్యూ ఎరా జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... యువత సన్మార్గంలో నడిచినప్పుడే అంతా మంచే జరుగుతుందని అన్నారు. గుర్తు తెలియని ఫోన్ నంబర్లకు స్పందించొద్దని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. శ్రావణ్‌కుమార్, ప్రముఖ సీఏ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్హత గల అభ్యర్థులు సెప్టెంబర్ 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు www.nationarkiacademy.in వెబ్‌సైట్‌లో లేదా ఫోన్ నం.95058 00050లో సంప్రదించాలన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయ హుండీ లెక్కింపును శనివారం ఆలయంలో నిర్వహించారు. ఈవో మహేందర్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ అండాలు పర్యవేక్షణలో లెక్కింపు కొనసాగింది. హుండీ లెక్కింపులో రూ.2.06 లక్షలు కానుకల రూపంలో వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి, తేజాగౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

హరికథ తెలుగు భాష ప్రాచీన కళా సంపద

డాక్టర్ కేవీ రమణాచారి


ఆదిభట్ల నారాయణదాసు జయంతి వేడుకలో డాక్టర్ కేవీ రమణాచారి, జనార్దనామూర్తి

చిక్కడపల్లి: హరికథ తెలుగు భాషకు మాత్రమే సొంతమైన ప్రాచీనే కళా సంపద అని పూర్వ సివిల్ సర్వీస్ ఉన్నతాధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో శనివారం గానసభ హరికథ కళాకారుల సంఘం నిర్వహణలో హరికథ పితామవుడు ఆదిభట్ల నారాయణదాసు జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ.. నారాయణదాసు బహుభాషలలో పండితుడని అన్నారు. ఆయన సంగీత సాహిత్యాలలో అపార జ్ఞాన నిధి అని వివరించారు. హరికథ, బుర్రకథ నాటకం వంటి ప్రాచీన కళా రూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కిన్నెర సంస్థ స్థాపకులు కిన్నెర రఘురాం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వారం రోజుల పాటు తమ సంస్థ హరికథా సప్తాహం నిర్వహిస్తున్న విశేషాలు తెలిపారు. అనంతరం చిరంజీవాచార్యులు భాగవతార్ శ్రీకృష్ణ రాయబారం హరికథా గానం చేశారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి, కళాకారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, విశ్వనాథ జయరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరిట్ అవార్డ్స్


మెరిట్ అవార్డ్స్ ప్రదానం చేస్తున్న ప్రొ. మ్యాడం వెంకట్‌రావు

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన మున్నూరుకాపు మెరిట్ విద్యార్థులకు శనివారం మెరిట్ అవార్డ్స్, మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన 69 మంది విద్యార్థులకు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు, ట్రస్టీ, తెలంగాణ మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు అందజేశారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిండ్ల అంజయ్య, ట్రస్టీ మేనేజర్ ప్రశాంత్, మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, కుల ప్రముఖులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ


ఏవీఎస్ రాజును సన్మానిస్తున్న అయోధ్య

చిక్కడపల్లి: తెలంగాణ పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఏవీఎస్ రాజు ఉద్యోగ విరమణ పొందారు. టీఎన్‌జీవో సెంట్రల్ ఫోరమ్ యూనియన్ అధ్యక్షుడు శాంగాంటి అయోధ్యలు శనివారం కలసి ఆయన పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అయోధ్య మాట్లాడుతూ... గ్రంథాలయ అభివృద్ధికి రాజు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుస్తె సుకేష్‌కుమార్, తోట సత్యనారాయణ, వర ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి ఠాణాలో డీసీపీ ఆకస్మిక తనిఖీలు



మాట్లాడుతున్న డీసీపీ అక్షాంశ్ యాదవ్, చిత్రంలో ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ సీతయ్య

చిక్కడపల్లి: సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్ శనివారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వినాయక చవితి ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసులు అప్రమతంగా ఉండాలని సూచించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిష్పక్షపాతంగా ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారి తనంతో పనిచేయాలని సూచించారు. అదే విధంగా కేసుల విషయాలను ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సీతయ్యను అడిగి తెలుసుకున్నారు.

చాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగితేనే సక్సెస్

మాజీ వైస్‌చాన్సలర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి


గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడుతున్న మాజీ వీసీ ప్రొ. సీహెచ్ గోపాల్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాన్ని చాలెంజ్‌గా తీసుకొని ముందుకు సాగితేనే సక్సెస్ అవుతారని మహాత్మాగాంధీ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ ప్రొ. సీహెచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసి మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే నిరంతర అధ్యయనం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొ. కృష్ణంరాజు, ప్రముఖ పర్యావరణవేత్త ఠాకూర్ రేష్మాసింగ్, అవంతి విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ డా. ప్రియాంక, అధ్యక్షుడు ఎం.జ్ఞానేశ్వరి, ఎండీ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా బాలకృష్ణ

ముషీరాబాద్: బీజేపీ మహంకాళి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు బాలకృష్ణ(ఎరుకల) నియమితులయ్యారు. శనివారం ఆయనకు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పదవులు వస్తాయని అన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ... ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎస్టీలంతా బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇచ్చేలా పని చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక


మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నేతలు

చిక్కడపల్లి: నియోజకవర్గ బీజేపీ నేతలు దోసేటి సత్యం, రాజశేఖర్, లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రామచంద్రరావును శనివారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. గాంధీనగర్‌లో ఆయన మాట్లాడుతూ... బీజేపీని మరింత బలోపేతం చేసేలా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు.

ఆలయాల్లో శని త్రయోదశి పూజలు



నల్లకుంట: శ్రావణ మాసం చివరి శనివారం శని త్రయోదశిని పురస్కరించుకొని ఆలయాల్లో రద్దీ నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాల్లో నవగ్రహ, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. న్యూనల్లకుంటలోని లక్ష్మీగణపతి ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం గణపతికి తొలపూజ చేశారు. అనంతరం ఆలయ అర్చక స్వామి రాఘవశర్మ మంత్రోచ్ఛరణల నడుమ ఆంజనేయ స్వామికి అభిషేకం చేశారు. న్యూరామాలయంలోని నవగ్రహాలకు తైలాభిషేకాలు చేశారు.

ఓటరు సర్వేపై బీఎల్‌ఓలకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీ మారుతీదివాకర్

కాచిగూడ: ఇంటింటి ఓటరు సర్వేపై శిక్షణను ఇస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట డిప్యూటీ కమిషనర్ మారుతీదివాకర్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శనివారం అంబర్‌పేట ఛే–నంబర్ చౌరస్తాలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో బూత్‌స్థాయి అధికారులకు (బీఎల్‌ఓలకు) ఇంటింటి సర్వేపై శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలపై ప్రజలు తమ అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు. ఏఈఆర్‌ఓలు సుమిత్ర, బి.రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



కాచిగూడ: వినాయక చవితిని పురస్కరించుకొని రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది శనివారం తొలగించారు. వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మాదేవేందర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, బీఆర్‌ఎస్ నేతలు మిరియాల శ్రీనివాస్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలి

అడ్డగుట్ట: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు.ఈ మేరకు శనివారం అడ్డగుట్ట డివిజన్ ముఖ్య నాయకుల సమావేశంలో అధ్యక్షుడు కన్నాభిరామ్ ఆధ్వర్యంలో జరిగింది.ప్రతి బూత్ నుంచి దాదాపు 300మంది సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలని సారంగపాణి సూచించారు.సికింద్రాబాద్ నియోజకవర్గంలోనే అడ్డగుట్ట డివిజన్‌ను సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరేందర్, కృష్ణ, నర్సింగ్‌రావు, సాయిబాబా, రవీందర్, మహేందర్, వేణుగోపాల్, విజయ్, కళావతి, హంసరాజ్, స్వామి, శ్రీనివాస్,శంకర్ తదితరులున్నారు.

ఆలయం ఎదుట నిలిచిన వర్షపునీరు


ముషీరాబాద్ మహంకాళి దేవాలయం ఎదుట నిలిచిన వర్షపునీరు

ముషీరాబాద్: ముషీరాబాద్ మహంకాళి దేవాలయం ఎదుట వర్షపునీరు నిలిచిపోయింది. శనివారం కురిసిన వర్షానికి నీరు నిలుస్తుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ నీటి నుంచే ఆలయంలోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని భక్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అందరి సహకారంతో ఎస్సీ వర్గీకరణ సాధించాం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


మందకృష్ణ మాదిగకు జ్ఞాపిక బహూకరిస్తున్న నాగులూరి సాయిబాబా

చిలకలగూడ: అందరి సహాయ సహకారాలతో ఎట్టకేలకు ఎస్సీ వర్గీకరణ సాధించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు, దళిత సంఘ సేవకుడు నాగులూరి సాయిబాబాను శనివారం ఆయన స్వగృహంలో మందకృష్ణ మాదిగను కలిసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ పోరాట ఉద్యమానికి సాయిబాబా తన సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటు అన్నివిధాల సహకరించారని మందకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. సంఘ సేవకుడు సాయిబాబా ప్రజాక్షేత్రంలోని వస్తే నిరుపేదలు, దళితులకు మరింత అండదండగా ఉంటారని అన్నారు. ఆయనకు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకత్వం పూర్తిగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగకు జ్ఞాపికను బహూకరించి శాలువాతో సన్మానించారు. పలు దళిత సంఘ నాయకులు, అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

9న గిరిజన సింహ గర్జన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సేవాలాల్ సేనా 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 9వ తేదీన ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న గిరిజన సింహ గర్జనను విజయవంతం చేయాలని సేవాలాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ పిలుపునిచ్చారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సేవాలాల్ సేనా కేంద్ర కార్యాలయంలో సింహ గర్జనకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

హెబ్రోను చర్చి వద్ద ఉద్రిక్తత

• చర్చి కెమెరాలు ధ్వంసం
• చెదరగొట్టిన పోలీసులు
• పోలీసుల అదుపులో ట్రస్ట్ సభ్యులు

చిక్కడపల్లి: గోల్కొండ క్రాస్ రోడ్స్‌లోని హెబ్రోను చర్చి నిర్వహణ కోసం సొసైటీకి ట్రస్ట్ సభ్యుల మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ అంశంపై న్యాయస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో చర్చి నిర్వాహణ కొనసాగుతుంది. కోర్టు స్టే అర్డర్ ఉన్నప్పటికీ శనివారం సాయంత్రం ట్రస్ట్ సభ్యులు చర్చిలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. గేటు వద్ద సొసైటీ సభ్యులు అడ్డుకున్నారు. ట్రస్ట్ సభ్యులు అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని చెదరగొట్టి, ట్రస్ట్ సభ్యులు అదుపులోకి తీసుకున్నారు.


హెబ్రోన్ చర్చివద్ద ఆందోళన ట్రస్ట్ సభ్యులు


హెబ్రోన్ చర్చివద్ద ఆందోళన ట్రస్ట్ సభ్యులు అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు